573) సామంతం

ప॥ నానాభరణముల నరసింహా । పూనిన ప్రతాపముల నరసింహా ॥

చ॥ నగవులనెమ్మోము నరసింహా । పొగరు మించుటూర్పుల నరసింహా ।
నగముమీది ఘన నరసింహా । తగు కాంతులయందపు నరసింహా ॥

చ॥ నళిననేత్ర శ్రీనరసింహా । పొలుపొందు నఖంబుల నరసింహా ॥
నలుదెసల మెఱయు నరసింహా । వెలయు మూడుగన్నుల నరసింహా ॥

చ॥ నమితసురాసుర నరసింహా । కమనీయగుణాకర నరసింహా ।
నమోస్తుతే శుభ నరసింహా । కమలాంక శ్రీవేంకట నరసింహా ॥